క్లుప్తంగా

విధుల్లో చేరిన ఏపీఎం రామకృష్ణ

జూలూరుపాడు: జూలూరుపాడు సెర్ప్ ఏపీఎంగా బోయినపల్లి రామకృష్ణ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సత్యనారాయణరాజు మధిరకు బదిలీ కాగా, ఆ స్థానంలో చుంచుపల్లి ఏపీఎం రామకృష్ణ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఉత్సవాలు నిర్వహించాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఆచార్య ప్రొఫెసర్ కె.జయశంకర్ జయంతిని ఇల్లెందు ఏరియాలో ఘనంగా నిర్వహించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా బీసీ అండ్ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. లైజనింగ్ ఆఫీసర్ నాగేషు ఆదేశాల ప్రకారం శనివారం ఏరియా జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు పులి పూర్ణచందర్, సర్వే అధికారి రామ్మూర్తి, వీటీసీ మేనేజర్ మహేష్, యాదగిరి, బి.కోటసాంబయ్య పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలి



పాఠకులతో చైర్మన్ వీరబాబు

కొత్తగూడెంఅర్బన్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నవారు, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలని గ్రంథాలయ చైర్మన్ వీరబాబు అన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పలువురు శనివారం చైర్మన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... కష్టపడి చదివితే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. ఇక్కడికి వచ్చి చదువుకునే వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తానన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నిక



బావుసింగ్, వెంకన్న

టేకులపల్లి: భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ అనుబంధం) టేకులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం సంఘం కార్యదర్శి దుబాకుల ప్రసాద్ వివరాలు వెల్లడించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ధరావత్ బావుసింగ్, కానుగుల వెంకన్న, ఉపాధ్యక్షులుగా బండారి మధు, మెండు వినోద్, సహాయ కార్యదర్శులుగా పెనకా సత్యనారాయణ, ఆత్మకూరి శ్రీనివాస్, కోశాధికారిగా బండారి శ్రీను లతోపాటు 17 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నిరాహార దీక్షను జయప్రదం చేయండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: బీసీ బిల్లు సాధన కోసం ఎమ్మెల్సీ కవిత చేపడుతున్న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఇల్లెందు నియోజకవర్గ జాగృతి అధ్యక్షుడు మాలోతు రాజేందర్ నాయక్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు లాకావత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం టేకులపల్లిలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆమేడ రేణుక, లాలు నాయక్, అరవింద్, సురేష్ పాల్గొన్నారు.

బిడ్డలకు తల్లిపాలే పట్టించండి..



మాట్లాడుతున్న మాధవి

పాల్వంచరూరల్: చంటి బిడ్డలకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని ఉల్వనూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మల్లారం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తల్లులు, గర్భిణులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌లతో అవస్థలు..

- ఎక్కడపడితే అక్కడ అనధికారికంగా ఫ్లెక్సీలు, జెండాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



పోస్టాఫీసు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కార్పొరేషన్ అయినప్పటికీ అభివృద్ధి, నిబంధనల అమలులో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. కార్పొరేషన్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం వలన వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీగా ఉన్నప్పటి కంటే కార్పొరేషన్ అయిన తరువాత అనధికారిక హోర్డింగ్‌లు, పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు జిల్లా కేంద్రంలో ఎక్కువయ్యాయి. రాజకీయ పార్టీల, కులసంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పార్టీ జెండాలను ప్రధాన రహదారుల మధ్య డివైడర్లపై, బస్టాండ్ సెంటర్‌లో, అమరవీరుల స్మారక స్తూపం వద్ద, రైల్వే అండర్ బ్రిడ్జిలో ఫుట్‌పాత్‌లపై, ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వలన ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా పలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. డివైడర్లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వాహనాలకు తగిలి రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీంతో పాటుగా వాహనదారులు వాహనాలను నడుపుతూ రంగురంగుల్లో ఆకర్షిస్తున్న ఫ్లెక్సీలను చూస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై స్థానికులు, వాహనదారులు ఫిర్యాదు చేస్తే స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని పలువురు కోరుతున్నారు.

అనుమతులు ఉన్నవి 18 మాత్రమే...

కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన 18 హోర్డింగ్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగతా వందలు, వేలల్లో ఉన్నవన్నీ అనధికారికమే. 18 హోర్డింగ్‌లకు గానూ సంవత్సరానికి వారు కార్పొరేషన్‌కు రూ.2 లక్షలు చెల్లిస్తున్నారు.

గత మార్చి వరకు ఇంకా ఐదు హోర్డింగ్‌ల ఫీజు ఇంకా చెల్లించకపోవడంతో వారికి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, జెండాలను తక్షణమే తొలగించి, అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నెలల తరబడి...

కొత్తగూడెంలో కొన్ని పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు అనుమతి లేకుండా ఏర్పాటు చేసి నెలల తరబడి అలానే ఉంచుతున్నారు. వాటిని ఎందుకు తొలగించడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తే కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. కొత్తగూడెం పట్టణంలో ప్రస్తుతం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో పాటుగా వర్షాలు పడుతున్నప్పుడు హోర్డింగ్‌లు, యాడ్ బోర్డులు, ఫ్లెక్సీలు రోడ్డు పడిపోతున్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణం అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలి...



కొత్తగూడెంలో ట్రాఫిక్ రద్దీ ఉన్నచోట ప్రమాదకరంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పార్టీ బ్యానర్లను వెంటనే తొలగించాలి. ఈ విషయంపై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశాం. వాటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కార్పొరేషన్ అనుమతులతో ప్రమాదాలు జరిగే అవకాశం లేని చోట ఏర్పాటు చేసుకోవాలి.

– సాధిక్‌పాషా, న్యాయవాది

గ్రామ వికాసం.. బీజేపీతోనే సాధ్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చుంచుపల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులను 'గ్రామ వికాసం.. బీజేపీతోనే సాధ్యం'అనే కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి ప్రచారం కోసం కార్యచరణ రూపొందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. శనివారం కొత్తగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో గ్రామ స్వరాజ్యం పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అధికార పార్టీ ఇచ్చిన తప్పుడు హామీలను అబద్ధపు ప్రచారాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మిరి నరేంద్రబాబు, జల్లారపు శ్రీనివాస్, యమునూరి శివ, శీలం విద్యాసాగర్, గొడుగు శ్రీధర్ యాదవ్, కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి..

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా వజీర్ మాట్లాడుతూ... వివిధ కేటగిరీల్లో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాల్లోని వారి పిల్లలకు కారుణ్య నియామకాలు ఇచ్చేందుకు గత సంవత్సరం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పెన్షన్, ఇతర ఆదాయ వనరులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీరికి వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు.

రోడ్డుపై గుంతలతో ఇక్కట్లు



తారు లేచిపోయిన రోడ్డు

సుజాతనగర్: మండలంలోని హరిజనవాడ, కోమటిపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు అధ్వానంగా తయారైంది. తారు రోడ్డు కచ్చా రోడ్డుగా మారింది. రహదారిపై పలుచోట్ల గుంతలు పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పెద్దపెద్ద గుంతలు కంకర తేలి ఉండటంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ప్రతీరోజు కోమటిపల్లి, గరీబ్‌పేట, చింతలతండా గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మార్గం గుండానే మండల కేంద్రం సుజాతనగర్‌కు వచ్చిపోతుంటారు. ఈ మార్గంలో రైస్ మిల్లులు, కోళ్ల ఫారాలు ఉండటంతో భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులకు పని కల్పించాలి..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందు: ఇల్లెందు సీహెచ్‌పీలో పని కోల్పోయిన కార్మికులకు పని కల్పించాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. ఇల్లెందు సీహెచ్‌పీలో కార్మికులకు పని లేక అల్లాడుతున్నారని ఇఫ్టూ జిల్లా నాయకులు సారంగపాణి, రాసుద్దీన్ తెలిపారు. శనివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బొగ్గు నాణ్యత లేదని సింగరేణి అధికారులు సీహెచ్‌పీని మూసివేశారని తెలిపారు. రవాణా నిలిపివేయటం వల్ల రైల్వే వ్యాగిన్లు ఆగిపోయాయని వాటి మీద ఆధారపడిన రైల్వే కార్మికులు పనుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తక్షణం సీహెచ్‌పీని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోడేటి నాగేశ్వరరావు, ఉపేందర్‌రావు, మోహన్‌రావు, శ్రీనివాస్, వెంకన్న, ఆంజయ్య, సామేల్, నరసింహరావు, మహేందర్, లాలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న రాంబాబు

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలంలో వివిధ పాఠశాలలలో క్యాంపెయిన్ నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు కావస్తున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు.

దీనిని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 5న జిల్లా కేంద్రాల్లో, కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.సరియ, ఎం.రామాచారి, పి.సత్యనారాయణ, కె.నర్సయ్య, పి.రాఘవులు పాల్గొన్నారు.

ఇల్లెందు: రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌పీసీ ఇల్లెందు మండల శాఖ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందు ఎంఈఓ కార్యాలయం ఎదుట యూఎస్‌పీసీ ఇల్లెందు మండల శాఖ నాయకులు ఆందోళన చేశారు. నాయకులు భాగ్యారావు, వెంకట్రాం, సర్వేశ్వరరావు మాట్లాడుతూ... ఉద్యమాలతో పోరాడి సాధించుకున్న చరిత్ర తమ సంఘానికి ఉందన్నారు. పీఆర్‌సీ, బదిలీలు, ప్రమోషన్లు, 317 జీఓ వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానికతను గుర్తించి ఇవ్వాలని కోరారు. ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దత్తం, శివ, పూర్ణిమ, లక్ష్మీనారాయణ, రాములు, శంకర్, వెంకటేశ్వర్లు, జయరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బొమ్మలు!

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు బొమ్మల తయారీని వృత్తిగా ఎంచుకుని పాల్వంచకు తీసుకొచ్చి జాతీయ రహదారిని అడ్డాగా చేసుకుని అన్నిరకాల టాయ్స్ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. వివిధ సైజులలో రంగురంగుల బొమ్మలు వచ్చిపోయే వారిని ఆకట్టుకుంటున్నాయి. ఏనుగు, కుక్కపిల్ల, కుందేలు, ఫాంటా, గుర్రాలు, తాబేళ్లు, జింకలు, పులి, టెడ్డీ బేర్ తదితర బొమ్మలు చిన్నారులను మరింత ఆకట్టుకుంటున్నాయి. బొమ్మల సైజును బట్టి రూ.200 – రూ.1200 వరకు విక్రయిస్తున్నట్లు బొమ్మల వ్యాపారి సునిల్ తెలిపారు. – పాల్వంచరూరల్





బొమ్మ కొనుగోలు చేస్తున్న స్థానికుడు, వివిధ సైజుల్లో బొమ్మలు

మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మహిళా సాధికారతకు గౌరవ ప్రదమైన ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ అన్నారు. శనివారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రి, మెయిన్ వర్క్‌షాపులో జరిగిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో మహిళా సాధికారతను ప్రోత్సహించాలంటే మహిళా ఉద్యోగులకు భద్రత, సౌకర్యాలు, గౌరవంతో కూడిన పని వాతావరణం తప్పనిసరిగా ఉండాలన్నారు. బొగ్గు గనులలో మరియు ఇతర శాఖలలో పనిచేస్తున్న మహిళల కోసం ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునే గదులు, క్రచ్, కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ పవన్‌కుమార్, బి.రామ్‌సింగ్, జీవీ కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, సంగం చందర్, రాజమౌళి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళా సాధికారతే లక్ష్యంగా ఉద్యమాల రూపకల్పనకు ఆదివారం శేషగిరిభవన్‌లో నిర్వహించనున్న భారత మహిళా సమాఖ్య కొత్తగూడెం 3వ పట్టణ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు, మాజీ 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ పిలుపునిచ్చారు. శనివారం రామవరం లక్ష్మీటాకీస్ ఏరియాలో మహాసభ విజయవంతం కోరుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతీ గృహిణికి రూ.2,500 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.మార్తమ్మ, టి.దుర్గ, బి.పద్మ, ఆర్.పద్మ, నూరి, టి.మాణిక్యం, కె.ప్రేమవాణి, సునీత పాల్గొన్నారు.

భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ వారి ఆధ్వర్యంలో మానసిక రుగ్మతలను నిరోధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ హార్ట్‌ఫుల్‌నెస్ వారు సూచించే విషయాలను ఆచరించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. చెడుకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కత్తి రమేష్, ట్రైనీ మాధురి, వలంటీర్స్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు..



మాట్లాడుతున్న సీఐ సురేష్

ఇల్లెందు: జీవితాలను అంధకారం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సీఐ టి.సురేష్ కోరారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సత్ప్రవర్తన వల్ల జీవితాలు ఉన్నత మార్గంలో పయనిస్తాయని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారితే జీవితాలు బుగ్గిపాలు అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యతో ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే లింకులు ఓపెన్ చేస్తే ప్రమాదం ముంచుకోస్తుందన్నారు. ఏదైనా అత్యవసరమైతే 100 కాల్ చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి టి.జాన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సమస్యలు పరిష్కరించండి..



ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఇల్లెందురూరల్: పీహెచ్‌సీలలో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కార్యదర్శి యదళ్లపల్లి సావిత్రి, పీవైఎల్ మండల కార్యదర్శి ఎలుగు శాంతారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రోగులకు అవసరమైన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రులలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, కమల, పద్మ, బుజ్జి, సమ్మక్క, సతీష్, పాష, కోటేష్, దేవా, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా చింతలతండా



ముసలమ్మ ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: పర్యాటక ప్రాంతంగా కలెక్టర్ ఎంపిక చేసిన చింతలతండా గ్రామంలో శనివారం భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. భద్రాచలం పుణ్యక్షేత్రం, పర్ణశాల, పాపికొండలు వంటి ప్రదేశాలను పర్యాటకులు సందర్శిస్తున్నారు. అదేవిధంగా చింతలతండా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి పరిచేందుకు ప్రతిపాదనల కోసం ప్రత్యేకంగా గ్రామసభను ఏర్పాటు చేశారు. పర్యాటకుల కోసం ఐదు హట్స్ నిర్మాణం, వాటి నిర్వాహణ కోసం స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను ఐదుగురిని ఎంపిక చేశారు. అనంతరం అధికారులు సమీపంలోని గుట్టను సందర్శించారు. గుట్ట కింద ఉన్న గట్టు ముసలమ్మ ఆలయం, భీముడు జలపాతం, రాజుల కోనలను పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నివేదికను కలెక్టర్, ఐటీడీఏ పీఓ రాహుల్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ జేడీఎం హరికృష్ణ, ఎంపీడీఓ తాళ్లూరి రవి, సెర్ప్ ఏపీఎం రామకృష్ణ, ఐటీడీఏ ఏఈ యశ్వంత్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.కోట్లు ఖర్చు చేశారు.. నిర్వహణ మరిచారు

- టేకులపల్లిలో అలంకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్
- 18లో వెలిగేవి 8 మాత్రమే..



టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా మార్గంలో సెంట్రల్ లైటింగ్

టేకులపల్లి: అంధకారాన్ని దూరం చేసి ప్రజలకు రాత్రివేళలో వెలుగులు పంచేందుకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా మారింది. అటు సింగరేణి, ఇటు గ్రామ పంచాయతీ అధికారుల పట్టింపు లేకపోవడంతో లైట్లు వెలగక నెలలు గడుస్తున్నా పట్టించుకున్నవారే లేరు. టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా వరకు సుమారు కిలోమీటరు రహదారిని విస్తరించి సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ.3 కోట్లతో డివైడర్ నిర్మిస్తూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గత ప్రభుత్వంలో ఆగస్టు 2023లో అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ పనులను ప్రారంభించారు. సుమారు రూ.కోటితో సెంటర్ నుంచి రేగులతండా వరకు 300 మీటర్ల మేర రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారింది. పనులు నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితమే రూ.2 కోట్లతో బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మించాల్సి ఉండగా 610 మీటర్ల మేరకు రూ.1.29 కోట్లతో కేవలం బీటీ రోడ్డు మాత్రమే నిర్మించి మమ.. అనిపించారు.

వెలగని లైట్లు.. ఎప్పటిలాగానే అంధకారం..

సుమారు రూ.కోటితో సెంటర్ నుంచి రేగులతండా వరకు 300 మీటర్ల మేర రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. మొత్తం 18 స్తంభాలకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయగా వాటిలో ప్రస్తుతం 8 మాత్రమే వెలుగుతున్నాయి. దాదాపుగా ఏడాది నుంచి మిగతా పది సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. అయినా సింగరేణి, గ్రామ పంచాయతీ, పీఆర్ శాఖ అధికారులు మాకు సంబంధం లేదన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి అన్ని లైట్లు వెలిగేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ ఎవరి బాధ్యత..?



టేకులపల్లి నుంచి రేగులతండా వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణానికి సింగరేణి సీఎస్ఆర్ నుంచి రూ.3 కోట్లు మంజూరు చేయడం మంచి విషయం. కానీ 18 సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేస్తే 8 మాత్రమే వెలుగుతున్నాయి. దీనికి సింగరేణి, గ్రామ పంచాయతీ రెండు శాఖల్లో ఎవరు బాధ్యులు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– తోటకూరి సతీష్, పీవైఎల్ నాయకుడు

అధికారులు స్పందించాలి..



టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా వరకు సెంట్రల్ లైటింగ్‌లో 10 లైట్లు పని చేయడం లేదు. నిత్యం అధికారులు, పాలకులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. లైట్లు వెలగని దుస్థితి కనిపించడం లేదా? ప్రమాదాలు జరగక ముందే పూర్తిస్థాయిలో వెలుగులు నింపేలా కొత్తలైట్లు ఏర్పాటు చేయాలి. ఈ సమస్యపై ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టి సారించాలి.

– సుందర్‌పాల్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు